క్లుప్తంగా

బీసీ సంఘం జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలిగా దరియా



నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘ జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలిగా దాసరి దరియా నియమితులయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన బీసీ సంఘాల ఆత్మీయ సమావేశంలో సంఘ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకున్నట్లు దరియా తెలియజేశారు. జిల్లాలో సంఘ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని చెప్పారు.

ఎఫ్ఏ-4 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: రైలుపేటలోని నగరపాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను శనివారం ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం సందర్శించారు. ఈ సందర్భంగా ఫార్మేటివ్ అసెస్మెంట్ (ఎస్ఏ-4) ఫలితాల్లో అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఫోటో దిగారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టిన దుండగులు

గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీలో నివసించే డి.శ్రీనివాస్ మిర్చి యార్డులో కూలిగా పనిచేస్తుంటాడు. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపి లోపలకు వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టారు. ఈ మేరకు శ్రీనివాస్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు కలుషితంపై అప్రమత్తత అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: కలుషితమైన నీటిని తాగడం వల్ల అనేక జబ్బుల బారిన పడే అవకాశాలున్నాయని, దీనిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులు స్థానికంగా ఇంటింటికీ వెళ్లి కాచి చల్లార్చిన నీటిని తాగాలని, కలుషితమైన ఆహారానికి దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఏ. శ్రీధర్, ప్లేస్మెంట్ అధికారి చంద్రశేఖర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ మధుసూదన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చదువు విలువ తెలుసుకోవాలి

విద్యార్థులంతా చదువు విలువ తెలుసుకోవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్-4 విభాగ అధికారి డాక్టర్ కె.విజయ కుమారి సూచించారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన లాలుపురంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థినులు ప్రతి ఇంటికీ వెళ్లి చదువు ఆవశ్యకత వివరించారు. పాఠశాలకు వెళ్తూ మధ్యలో ఆగి పోయిన విద్యార్థుల్ని గుర్తించి, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు విద్య గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థుల్ని మరలా పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి ఎం.ఎస్. మీనాక్షి కళాశాల అధ్యాపకులు ఎస్.విజయలక్ష్మి, ఎం. విజయలక్ష్మి పాల్గొన్నారు.

■ జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో అడవితక్కెళ్లపాడులోని నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి, తడిచెత్త, పొడిచెత్త గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి డి. రాహుల్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీతో పేదల ఇళ్లల్లో వెలుగులు

ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా

పట్నంబజారు: ప్రతి పేదవాడి ఇంట్లో వెలుగులు నింపేలా రాష్ట్రముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అన్నారు. నియోజకవర్గంలోని 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ ఆధ్వర్యంలో నెహ్రూనగర్ 6వ లైనులో శనివారం జగనన్న కాలనీల ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రతి పేదవాడు చిరునవ్వులు చిందిస్తూ ఎంతో సంతోషంగా ఉన్నారంటే ప్రతి ఒక్కరికీ ఇళ్లను అందజేయడమేనని తెలిపారు. ఈ ఐదేళ్లల్లో 32 లక్షలకు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికే దక్కుతోందని కొనియాడారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తుంటే టీడీపీ ప్రభుత్వం కోర్టుకు వెళ్లి ఆపేందుకు కుట్రలు చేయడం సిగ్గుచేటని ఖండించారు. రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమార్తె షేక్ నూరిఫాతిమాను భారీ మెజార్టీతో గెలిపించి సీఎం వై.ఎస్.జగన్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్ అయిశెట్టి శ్రీనివాస్, యడ్లపల్లి విజయలక్ష్మి, ఎస్.శ్రీనివాసరావు, టి.సురేష్ పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం జగన్ లక్ష్యం

సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో శనివారం సీఎంఆర్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు అయిన రూ. 7.35 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేందుకు సీఎం వై.ఎస్.జగనన్న ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 25 లక్షల వరకు నిరుపేదల వైద్య ఖర్చుల కోసం అందజేస్తున్నారని తెలిపారు. పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూడా అందజేస్తూ ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూస్తున్నారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నేరుగా ప్రజల వద్దకే వైద్యాన్ని పంపిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నూరిఫాతిమా

రూ.1497.14కోట్లతో వార్షిక బడ్జెట్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ 2024-25 సంవత్సరానికి రూ.1497.14 కోట్ల అంచనాలతో శనివారం నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సభ్యులు నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి నగరపాలక సంస్థ విభాగాధిపతులతో, ఆడిట్ అధికారులతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రివైజ్డ్ బడ్జెట్, 2024-25కు సంబంధించిన అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌పై మేయర్ చాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.634.56 కోట్ల ప్రారంభ నిల్వతో పాటు వార్షిక ఆదాయం రూ.612.62 కోట్లతో కలిసి రూ.1247.19 కోట్లతో కౌన్సిల్ ఆమోదం చేసి ఉందన్నారు. అందులో రూ.578.62 కోట్లు ఖర్చులు పోగా, అంత్య నిల్వ రూ.669.56 కోట్లుగా ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ.669.56కోట్లు ఉండగా, నగరపాలక సంస్థ సంవత్సరానికి సంబంధించిన ఆదాయం రూ.828.57 కోట్లు అంచనాతో రూ.1497.14 కోట్లతో వార్షిక బడ్జెట్‌ని స్టాండింగ్ కమిటీ ఆమోదించిందని పేర్కొన్నారు. రూ.923.47 కోట్లు ఖర్చులు పోగా అంత్య నిల్వ 573.66 కోట్లు ఉంటుందని తెలిపారు. త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదం కోసం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, వెంకట లక్ష్మి, విభాగాధిపతులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు షేక్ మహమూద్, సంకూరి శ్రీనివాసరావు, కంద్రగుంట గురవయ్య, శ్యామల వెంకట రమణాదేవి, మల్లిబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేడ్కర్ పాల్గొన్నారు.



నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి బడ్జెట్‌పై అధికారులతో సమావేశమైన మేయర్ కావటి

స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలకం

- వర్సిటీ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి
- ముగిసిన సోషియాలజీ, సోషల్ వర్క్ జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: పేదలు, నిర్లక్ష్యానికి గురైన వృద్ధులు, బాల కార్మికులు, రోగులు, అణగారిన వర్గాలకు సేవలు అందించడంలో ఎన్జీవోల పాత్ర కీలకమని రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి అన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ' నెట్‌వర్కింగ్ అండ్ ఇంటర్‌ఫేసింగ్ ఆఫ్ నాన్- గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కన్వర్జెన్స్ ఇన్ సోషల్ యాక్షన్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి మాట్లాడుతూ సమాజంలో స్వచ్ఛంద సేవా సంస్థలు తిరుగులేని శక్తిగా మారాయని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక, సంప్రదాయం, సంస్కృతి వంటి కీలక అంశాలను ప్రజలకు చేరువ చేయడంలో ఎన్జీవోల ప్రతినిధులు నిరంతరాయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డీన్ ఆచార్య జి.వి.రమణ మాట్లాడుతూ ఎన్జీవోలపై ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు. గోవా కి చెందిన జాగ్రఫీ అధ్యాపకులు డాక్టర్ రత్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు విద్యా పరిశోధన అంశాలపై దృష్టి సారించాలని చెప్పారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్సిటీ చరిత్రలో ఎన్జీవోలపై జాతీయ సదస్సు నిర్వహణ ఇదే ప్రథమం అన్నారు. అసమానతల నిర్మూలనలో సమాజాభివృద్ధికి దోహదపడే స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని తెలిపారు. జాతీయస్థాయిలో కర్ణాటక, గోవా, పంజాబ్, తమిళనాడు, ఒడిస్సాతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 160 పైగా పరిశోధన పత్రాలు వచ్చాయని చెప్పారు. రెండు రోజుల పాటు 10 టెక్నికల్ సెషన్స్‌లో విలువైన చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సోషల్ సైన్స్ డీన్ ఆచార్య ఎం. త్రిమూర్తి రావు సదస్సు నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ఆచార్య కె. ధనలక్ష్మి, డాక్టర్ రాజకుమార్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు .



ప్రసంగిస్తున్న ఆచార్య వరప్రసాదమూర్తి

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

ఎన్నికల నిర్వహణపై సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర అని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సజావుగా జరగడానికి బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల విధులపై సెక్టోరల్, రూట్ అధికారులకు అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ కె.రాజ్యలక్ష్మితో కలిసి శనివారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమలో ఒక్కో నియోజకవర్గానికి 22 మంది సెక్టోరల్, 22 మంది రూట్ అధికారులకు విధులు కేటాయించామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వస్తుందని, సెక్టోరల్ అధికారులు ముందుగా తమకు కేటాయించిన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని ఆమె ఆదేశించారు. ముందుగా ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలతో కూడిన హ్యాండ్ బుక్‌ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం నగర పాలక సంస్థలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులకు, వికలాంగులకు వీలుగా ర్యాంపులు, విద్యుత్, తాగునీటి సరఫరా, మరుగు దొడ్లు వంటి కనీస వసతులపై రిపోర్ట్ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ఓ నిరంజన్, ఏఈఆర్ఓ ప్రదీప్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్లు సాంబశివ రావు, ప్రసాద్, పద్మ పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కమిషనర్

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలి

నగరంలో మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) సర్వేకు సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. శనివారం జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో కలిసి సర్వే పోస్టర్‌ని నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీం ద్వారా ఎంఎస్ఎంఈ ఏకీకృత పోర్టల్ ప్రారంభించిందన్నారు. ఇందులో ఒక అంశమైన ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్‌లో భాగంగా పరిశ్రమల శాఖ ఈ నెల 1 నుంచి 20 వరకు సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలకు ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌ని అనుసంధానం చేయడం కోసం జరిగే సర్వేలో నగరంలోని అన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మదన్ మోహనశెట్టి, డీడీ ఎం.సుధాకర్, జోనల్ మేనేజర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



పట్నంబజారు: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్‌లో ఎస్‌హెచ్ఓ షేక్ అన్వర్‌బాషా వివరాలు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం వచ్చిన సమాచారం మేరకు గౌరీశంకర్ థియేటర్ వద్ద ద్విచక్ర వాహనంతో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులను నగరంలోని లాలాపేటకు చెందిన షేక్ జానీబాషా, హైదరాబాద్‌లోని అశోక్‌నగర్, హనుమాన్ గుడి వద్ద నివాసం ఉండే మహంకాళి వెంకటేష్‌గా గుర్తించినట్లు తెలిపారు. నివాసాల ముందు పార్కింగ్ చేసి బైక్‌లను మారుతాళాలతో చోరీ పాల్పడుతున్నట్లు చెప్పారు. తెలిపారు. నిందితుల నుంచి రూ. 4 లక్షలు విలువ చేసే ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రూ. 15 లక్షల ఎనస్థీషియా వర్క్ స్టేషన్ వితరణ

గుంటూరు మెడికల్: థొరకోస్కోపి చేసే రోగులకు అవసరమైన రూ. 15 లక్షలు విలువ చేసే ఎనస్థీషియా వర్క్ స్టేషన్‌ను శనివారం గుంటూరులోని ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల ఆసుపత్రికి ఐటీసీ హెచ్ఆర్ వైస్ ప్రెసిడెంట్ వీరాస్వామి అందజేశారు. కనెక్ట్ టూ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్ అధికారులు తమకు వైద్య పరికరాలు కావాలని సీఈఓ కోట్ల శివ శంకరరావును సంప్రదించారు. ఆయన ఐటీసీ ద్వారా సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఆసుపత్రికి వైద్య పరికరాలు విరాళంగా అందజేయించారు. శివశంకరరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా కంపెనీల యాజమాన్యాల నుంచి విరాళాలు సేకరించి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందమైన భవిష్యత్తును సృష్టించడానికి కార్పొరేట్ దిగ్గజాలు తమతో చేతులు కలపాలని, స్థిరమైన, సమ్మిళిత సమాజాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘు, డాక్టర్ భాస్కరరావు, శ్రీరంగం శేషాద్రి, రంగ స్వామి, గౌరినాయుడు పాల్గొన్నారు.



వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న ఐటీసీ హెచ్ఆర్ వైస్ ప్రెసిడెంట్ వీరాస్వామి

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

లక్ష్మీపురం: హుజూర్ గౌసే ఆజం దస్తగిర్ (హజ్రత్ మహబూబ్ సుభాని) వారి 17వ మనువలు గుంటూరు నగరంలో వేంచేసి ఉన్న హజ్రత్ మొహీయుద్దీన్ బాద్‌షా అవులియా బాబా 314వ ఉరుసు, హజ్రత్ సయ్యద్ షా అసదుల్లా ఖాదిరి బాబా వారి 90వ ఉరుసు మహోత్సవాలు పండుగ వాతావరణంలో అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని దర్గా పీఠాధిపతులు మహబూబ్ సుభాని వారి 23వ మనువలు సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి అల్ జిలానీ సాహెబ్ అన్నారు. స్థానిక నల్లచెరువు ఎత్తురోడ్డు సెంటర్‌లోని హజ్రత్ మొహీయుద్దీన్ పాలెంలోని దర్గా ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పవిత్ర రంజాన్ మాసానికి ముందు వచ్చే షాబాన్ మాసం చంద్రమాన 21వ రోజు తమ తండ్రి గురువులైన సయ్యద్ షా నూరుల్ ముస్తఫా ఖాదిరి ఆశీస్సులతో బాబా ఉరుసు మహోత్సవాలు నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహోత్సవాలు ఈనెల 3వ తేదిన ఆదివారం రాత్రి 9 గంటలకు సందల్ షరీఫ్(గంథోత్సవం)తో ప్రారంభమవుతాయన్నారు. 4వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం, రాత్రి 9 గంటలకు హైదరాబాద్ వారి బృందంతో గొప్ప ఖావ్వాలి, 5వ తేదీ సాయంత్రం ఖతమ్ షరీఫ్ సందర్భంగా గొప్ప అన్నదానం, రాత్రి 10 గంటలకు నాత్ ఎ షరీఫ్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మొహీయుద్దీన్ పాలెం వాసులు, నగర ప్రముఖులు, పీర్ మురీదులు తదితరులు పాల్గొన్నారు.



ఉరుసు పోస్టర్‌ను ఆవిష్కరించిన సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి అల్ జిలానీ సాహెబ్

జిల్లా పరిషత్ అతిథి గృహం ప్రారంభం

పొన్నూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని శనివారం చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ప్రారంభించారు. వినియోగం లేక ఎంతోకాలంగా మూతపడిన భవనాన్ని లీజు ద్వారా ప్రైవేటు వ్యకులకు అధికారులు కేటాయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ అతిథి గృహం ద్వారా జిల్లా ప్రజా పరిషత్‌కు ఆదాయం సమకూర్చేలా అధికారులు పనిచేయాలని తెలిపారు. జెడ్పీ గెస్ట్ హౌస్ అన్యాక్రాంతం కాకుండా అభివృద్ధి చేసిన పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో పెదకాకాని జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, పొన్నూరు ఎంపీపీ పద్మలీల, వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందరాజు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.



అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా